www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 13 డిసెంబర్ 2025

నాణ్యమైన విద్య కావాలి...

డ్రగ్స్ మాకొద్దు..!

- వేడుకగా ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలు ప్రారంభం
- ప్రతినిధుల సభలో మాజీ జస్టిస్ చంద్రు ప్రారంభోపన్యాసం

తిరుపతి పురవీధుల్లో కదం తొక్కిన విద్యార్థిలోకం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుపతి సిటీ, తిరుపతి టౌన్

'విద్య కాషాయికరణ వ్యతిరేక పోరాటంలో విజయం మనదే... అన్నమయ్య కీర్తనలు చెబుతాయి..మనమంతా ఒక్కటేనని.. మీరెవరు మమ్మల్ని కులమతాల పేరుతో విడదీయడానికి.. విద్య అనేది హిందూ భావజాలంతో కాదు, ఉన్నత ప్రమాణాలతో ఉండాలి'

- ఎస్ఎఫ్ఐ అఖిల భారత కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య

ఉన్నత విద్యను అందించే విశ్వ విద్యాలయాల్లో మతతత్వాన్ని ప్రేరేపించే వ్యక్తులకు వైస్‌ఛాన్సలర్ పదవులు ఇస్తూ, ఉన్నత విద్యను కాషాయమయం చేస్తున్నారు.. విద్యార్థి నాయకుడిగా ఎదిగి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబునాయుడు, ప్రస్తుతం విద్యార్థిసంఘాలపై ఆంక్షలు పెట్టడం ఏంటి.. **- ఎస్ఎఫ్ఐ అఖిల భారత మాజీ అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు**

' కూటమి ప్రభుత్వం వచ్చి 18 నెలలయ్యింది, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఒక్కటి నెరవేర్చకపోగా వరల్డ్‌క్లాస్ ఎడ్యుకేషన్ తెస్తామని మంత్రి నారా లోకేష్ అంటున్నారు. మా నాయకుడు పెంచలయ్య డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుతుంటే నెల్లూరులో దారుణంగా హత్య చేశారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలి. పెంచలయ్య స్ఫూర్తితో డ్రగ్స్ అంతం.. ఎస్ఎఫ్ఐ పంతం అనే నినాదంతో మహాసభ పిలుపు ఇవ్వనుంది.

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్నకుమార్

విద్యార్థులను ఘాతుకంగా హింసించి చంపే హంతకులు చంద్రబాబు క్యాబినెట్లో ఉన్నారు. నారాయణ విద్యాసంస్థల్లో లక్షల్లో ఫీజులు వసూలు చేసి విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చిపిప్పి చేస్తున్నారు.

- తెలంగాణా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

ఎంతోమందికి విద్యను అందించిన టిటిడిలో బిజెపి వచ్చిన తరువాత హిందూ మతం పేరుతో క్రిష్టియన్, ముస్లీం, మైనార్టీ విద్యార్థులను చదువుకు దూరం చేస్తుంది. మాక్ అసెంబ్లీ విద్యార్థులతో నిర్వహించడం కాదు, అన్ని కాలేజీల్లో విద్యార్థిసంఘాలకు ఎన్నికలు పెట్టి చూస్తే ఎస్ఎఫ్ఐ సత్తా ఏంటో చూపిస్తాం.. **-వి.నాగరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు**

పూలే విగ్రహానికి పూలవేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

బహిరంగ సభ వేదికపై అభివాదం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కేజీ నుంచి పీజీ వరకూ కోట్లల్లో ఫీజులు

- పేదలకు ఉచిత విద్యకోసం ఉద్యమించాలి
- ఎస్ఎఫ్ఐ ప్రతినిధుల సభలో రిటైర్డ్ జస్టిస్ కె.చంద్రు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

దేశంలో పేదలకు ఉచిత విద్య అందడం లేదని, కేజీ నుంచి పీజీ వరకు కోట్లాది రూపాయలు డబ్బులు ఫీజుల రూపంలో ఖర్చు చేయాల్సి వస్తోందని మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ కె.చంద్రు అన్నారు. ఒక్క పీజీ సీటుకి కోటి రూపాయలు ధర పెట్టడంతో సామాన్య మధ్య, పేద వర్గాలు చదువుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. శుక్రవారం సాయంత్రం తిరుపతి కచ్చపి ఆడిటోరియం వేదికగా 25వ రాష్ట్ర మహాసభల ప్రతినిధుల సభ ప్రారంభమయ్యింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థి ఉద్యమ అగ్రనేతలు భగత్ సింగ్, సీతారాం ఏచూరి, మాజీ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కె.చంద్రు మాట్లాడుతూ ట్రంప్ నా స్నేహితుడని పదే పదే చెబుతున్న మోడీ భారతదేశంపై 50 శాతం సుంకాలు వేసిన పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వీరసావర్కర్ విగ్రహం పెట్టడం దారుణం అన్నారు. వీర సావర్కర్ పేరుతో స్టాంప్ ని రిలీజ్ చేయడం సిగ్గుచేటు అన్నారు. అండమాన్ నికోబార్ ఎయిర్పోర్టుకు వీరసావర్కర్ పేరు పెట్టడం దారుణమన్నారు. వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వాటి గురించి మోడీ ప్రభుత్వం రాజకీయం చేయడం బాగో లేదన్నారు. వందేమాతరం అన్ని వర్గాల ప్రజలు ఆశిస్తున్నప్పటికీ మోడీ ప్రభుత్వం హిందూ ఓట్ల కోసం పాకులాడం దారుణం అన్నారు. పేదలకు ఉచిత విద్య కోసం ఎస్ఎఫ్ఐ మరింత ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఎఫ్ఐ చేస్తున్న ఉద్యమాలు విద్యార్థి లోకానికి తలమానికమని అన్నారు.

ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు ఆదర్శ యం సాజి మాట్లాడుతూ విద్యా వ్యవస్థను ఆర్ఎస్ఎస్ బిజెపి కాషాయికరణ చేశాయని, దీనివల్ల సామాన్య మధ్య తరగతి పిల్లలకు ఉచిత విద్య అందడం లేదన్నారు. కార్పొరేట్ సంస్థల కోసం ఉచిత విద్యను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా 89 వేల ప్రభుత్వ స్కూళ్లుమూత బడ్డాయి అన్నారు. ఎక్కువగా బిజెపి పాలించే రాష్ట్రాల్లో గుజరాత్, అస్సాం, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ తో పాటు ఇతర రాష్ట్రాల్లో 65 లక్షల మంది బడి మానేశారని గుర్తు చేశారు. ఉచిత విద్య పేదలకు ఎక్కడ లభిస్తుందని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం అదానికి అస్సాం రాష్ట్రంలో నాలుగు రూపాయలకు గుజరాత్‌లో ఒక్క రూపాయికి ఎకరా భూమి ఇవ్వడం జరిగిందన్నారు. ఉచిత విద్యకు మాత్రం నిధులు లేవని ఏవేవో సంస్కరణలు తీసుకువచ్చి ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటపరం చేస్తున్నారన్నారు. ఒక్క రూపాయికి దేశంలో ఒక చాక్లెట్ కూడా రాదని గుర్తు చేశారు. అదానికి మాత్రం ఒక్క రూపాయికి ఎకరా భూమి ఇవ్వడం దారుణం అన్నారు. ఆ రాష్ట్రాల్లో ఎస్ఎఫ్ఐ అనేక ఉద్యమాలు చేసిందని గుర్తు చేశారు. కేరళ రాష్ట్రంలో ఉచిత విద్యతో పాటు నాణ్యమైన నిపుణులతో విద్యను నేర్పిస్తున్నారని గుర్తు చేశారు. విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కే ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాసంస్థలపై ఎస్ఎఫ్ఐ అనేక పోరాటాలు చేసి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కషి చేస్తుందని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం, ఉచిత విద్య కోసం, విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసి అధికారుల దష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేలా చేస్తున్నామన్నారు. ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ సీతారాం ఏచూరిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఎస్వీ యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. గోవింద ధామం అధ్యక్షులు టెంకాయల దామోదరం మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్య వ్యవస్థ అభ్యున్నతి కోసమే పోరాడుతూ ఉంటుందని, వారి పోరాటానికి విద్యార్థుల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

SFI
కామ్రేడ్ భగత్ సింగ్
SFI
ప్రపంచ విప్లవకారుడు
చేగువేరా

నగరంలో ఎస్ఎఫ్ఐ ర్యాలీ

వేతనాలు పెంచి తీరాల్సిందే..

- దద్దరిల్లిన కలెక్టరేట్
- మహాధర్నాలో పాల్గొన్న అంగన్వాడీలు
- మద్దతు తెలిపిన సిఐటియు, ఏఐటియుసి, ఐఎఫ్‌టియు

వేతనాలు పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికై... కలెక్టరేట్ వద్ద
మహా ధర్నా

ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం, కనీస వేతనాల పెంపు కోసం రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు శుక్రవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు భారీ ఎత్తున తరలివచ్చి మహా ధర్నాను నిర్వహించడం జరిగింది. అంగన్వాడీల ఈ ధర్నాకు సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్టియు అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ ధర్నాకు అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయ, ప్రభావతి, వెంకటరత్నమ్మ అధ్యక్షత వహించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు మాట్లాడుతూ గతంలో 42 రోజుల అంగన్వాడీల పోరాట సమయంలో ప్రస్తుత సిఎం, మంత్రులు నిరసన కార్యక్రమాలో పాల్గొని తాము అధికారంలోకి వస్తే తక్షణం అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామి ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రెండేళ్లు అవుతున్నా అంగన్వాడీల గురించి పట్టించుకోలేదని, ఒకటి రెండు తప్ప ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. అంగన్వాడీలకు కనీస వేతనాలు కూడా ఇవ్వని పరిస్థితి ఉందని పైగా వారిపై పనిభారం పెంచడం, రాజకీయ వేధింపులకు పాల్పడం దారుణమని ధ్వజమెత్తారు. అంగన్వాడీలను ధర్నాకు రాకుండా చేయాలని ఎత్తుగడలు వేసిన అడ్డంకులను ఎదుర్కొని భారీస్థాయిలో కదిలి వచ్చారంటే వారి సమస్యలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, గ్రాట్యూటి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 11సంవత్సరాలుగా వేతనాలు పెంచకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేస్తూ బడ్జెట్లో కోతలు పెడుతూ ఐసిడిఎస్‌ను ప్రైవేటపరం చేసే దిశగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల సందర్భంగా దేశవ్యాప్తంగా అంగన్వాడీలు కనీస వేతనాల కోసం పోరాటం చేస్తున్నారని, రాష్ట్రంలో కూడా గత ప్రభుత్వాలకు అంగన్వాడీ పోరాటం ఎలా ఉంటుందో రుచి చూపించారని ప్రస్తుత ప్రభుత్వానికి గతఅనుభవాన్ని గుర్తు చేసుకోవాలని అన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకపోతే భవిష్యత్తులో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి గిరిధర్ గుప్తా, గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు, ఏఐటీయుసి జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కొత్తపల్లి సుబ్రహ్మణ్యం ధర్నాలో మాట్లాడారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్‌ను కలిసి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి (సిఐటియు) షకీల, (ఏఐటియుసి) జిల్లా ప్రధానకార్యదర్శి ప్రేమ, (ఐఎఫ్‌టియు) అంగన్వాడీ రాష్ట్ర కార్యదర్శి విఆర్.జ్యోతి, నాయకులు ప్రమీల, మమత, లీలావతి, మమత బుజ్జి, సుజిని, జమున, పద్మ, శ్యామల, సరళ శీలా పాల్గొన్నారు.

చిత్తూరు కలెక్టరేట్ ఎదుట మహాధర్నాలో భారీగా పాల్గొన్న అంగన్వాడీలు

ఘటనాస్థలంలో మృతదేహాలు

విహారయాత్ర విషాదం

- 'చింతూరు' ఘటనలో ఆరుగురు దుర్మరణం
- చిత్తూరులో ఐదుగురు, తిరుపతిలో ఒకరు
- పుణ్యక్షేత్రాలకు వెళ్లి విగతజీవులుగా స్వస్థలాలకు
- మృతదేహాలను తీసుకొచ్చే ఏర్పాట్లలో యంత్రాంగం
- ఎంఎల్ఎ, ఎంపి, సిపిఎం దిగ్భ్రాంతి

మృతుల వివరాలు

ఈ ప్రమాదంలో శైలజా రాణి, శ్యామల, పి.సునంద, శివ శంకర్ రెడ్డి, ఎస్‌వి.నాగేశ్వరరావు, కె.కృష్ణ, శ్రీకళ, దొరబాబు, కృష్ణ కుమారి మృతిచెందారు. వీరంతా చిత్తూరు జిల్లాలోని పలు మండలాలకు చెందిన వారు. క్షతగాత్రులలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉంది. వారిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారిలో తిరుపతికి చెందిన వ్యక్తి -1, చిత్తూరు -2, పలమనేరు -2, తవనంపల్లి -1, కర్నాటక -2, తెనాలి-1 ఉన్నారని సమాచారం.

ఉమ్మడి జిల్లాల మృతులు

చిత్తూరు మరాఠి వీధికి చెందిన, నాగేశ్వరరావు, శ్రీకళాదేవి

పలమనేరుకి చెందిన శివ శంకర్ రెడ్డి , సునందన

దొరబాబు తవణంపల్లి మండలం వంట మనిషి

తిరుపతి శైలజారాణి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్, యంత్రాంగం

పుణ్యక్షేత్రాలకు వెళ్లాలని చిత్తూరు, తిరుపతి జిల్లావాసులు చిత్తూరుకు చెందిన విగ్నేశ్వర ప్రైవేట్ ట్రావెల్స్ బుక్ చేసుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి మొత్తం 32 మందిని బుక్ చేసుకుంది. ఈనెల ఆరో తేదీ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాలను దర్శించుకుని, 13వ తేదీ ఉదయానికల్లా చిత్తూరుకు వచ్చి చేరాల్సి ఉంది. ముందురోజే స్నేహితులకు బంధువులకు వీడియోకాల్స్ చేసి మరీ ఉత్సాహంగా వారు చూసిన పుణ్యక్షేత్రాలన్ని వివరిస్తూ రెండు రోజుల్లో వచ్చేస్తామని చెప్పారు. అయితే తెల్లవారే వారి బతుకులు తెల్లారిపోతాయని వారికి తెలియదు. తెల్లవారుతుండగా ఊహించని కుదుపు. అల్లూరి జిల్లా మారేడుమిల్లి - చింతూరు ఘాట్‌లోని వనదుర్గ ఆలయ సమీపంలో శుక్రవారం తెల్లవారుజాము మూడున్నర గంటలకు వారు ప్రయాణిస్తున్న ప్రైవేటు బస్సు అదుపుతప్పి పెద్ద లోయలో తలకిందులుగా పడిపోయింది. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతిచెందారు. వారిలో నలుగురు పురుషులు, ఐదుగురు మహిళలు ఉన్నారు. మిగతావారంతా గాయపడ్డారు. వారంతా చింతూరు, భద్రాచలంల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురయ్యిందనే వార్త వినగానే తమ వాళ్లేమయ్యారని తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని బంధువులు, కుటుంబీకులు ఆందోళనకు గురయ్యారు. బస్సులో ప్రయాణిస్తున్న 32 మందిలో తొమ్మిది మంది అక్కడికక్కడే మృతిచెందగా, గాయపడ్డ వారిని అల్లూరి జిల్లా చింతూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. తీర్థయాత్రలకు వెళ్లిన వారిలో చిత్తూరు నగరం మరాఠీవీధి, దేవాంగవీధులకు చెందిన వారు ఏడుగురు వెళ్లారు. ఇందులో నాగేశ్వరరావు, శ్రీకళ బస్సు ప్రమాదంలో మృతిచెందారు.

పోలీసుల కథనం మేరకు.. ఈ నెల 6న చిత్తూరు నుంచి 35 మంది ప్రయాణికులతో ప్రైవేటు బస్సు బయలుదేరింది. ఇద్దరు డ్రైవర్లు ఆ బస్సులో ఉన్నారు. కోటప్పకొండ, అమరావతి, మంగళగిరి, విజయవాడ, ద్వారకా తిరుమల, భీమవరం, పాలకొల్లు, అంతర్వేది, కోటిపల్లి, పెనుగొండ, ద్రాక్షారం, అన్నవరం, అరసవల్లి, శ్రీకూర్మం, సింహాచలం, అరకులోయ ప్రాంతాలకు వెళ్లి వివిధ ఆలయాలను దర్శించుకున్నారు. తిరిగి అరకులోయ నుంచి గురువారం సాయంత్రం ఐదు గంటలకు భద్రాచలం దర్శనానికి వస్తుండగా మారేడుమిల్లి ఘాట్‌లోని వనదుర్గ ఆలయ సమీపంలోకి రాగానే బస్సు అదుపుతప్పి 30 అడుగుల లోయలోకి పడిపోయింది. అందరూ నిద్ర మత్తులో ఉండగానే ఈ హఠాత్పరిణామం చోటుచేసుకుంది. చుట్టూ చీకటి. ఏం జరిగిందో తెలుసుకునేలోపు విగతజీవులుగా తమవారు కనిపించారని క్షతగాత్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఘటనా స్థలం దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ప్రమాద సమాచారం బయట ప్రపంచానికి చేరడానికి చాలా ఆలస్యం జరిగింది. ఫోన్ సిగ్నల్స్ కూడా బాధితులకు అందని పరిస్థితి. గాయాలపాలైన వారు తమ వద్ద ఫోన్లతో అతికష్టం మీద సమాచారం తెలపడంతో చింతూరు మండల కేంద్రం నుంచి 108 వాహనం చాలా సేపటికి ఘటనా స్థలానికి చేరుకుంది. క్షతగాత్రులను ముందుగా చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాలను ఇక్కడికే తీసుకొచ్చారు.

ప్రమాదానికి కారణమేంటి ?

వారం రోజులుగా అల్లూరి జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. పొగ మంచూ విపరీతంగా కురుస్తోంది. వేకువజామున ఎదురుగా ఉన్న పరిసరాలు, రోడ్డు సైతం కనిపించడం లేదు. ఇదే పరిస్థితి మారేడుమిల్లి ఘాట్‌లో శుక్రవారం నెలకొంది. పైగా డ్రైవర్‌కు అనుభవం లేకపోవడం బస్సును కంట్రోల్ చేయలేకపోయినట్టు తెలుస్తోంది.

చిత్తూరు జిల్లా కలెక్టర్ అప్రమత్తం

ఘటన తెలిసిన వెంటనే చిత్తూరు జిల్లా కలెక్టర్, జిల్లా ప్రజాప్రతినిధులు అప్రమత్తమయ్యారు. చిత్తూరు ఎంఎల్ఎ గురజాల జగన్మోహన్ దేవంగ, మరాఠి వీధుల్లో పర్యటించి మృతుల బంధువులను, స్నేహితులను ఓదార్చారు. నాగేశ్వరావు, శ్రీకళ కుటుంబ సభ్యులు అమెరికాలో ఉన్నట్లు తెలియడంతో పోలీసులు వారికి సమాచారం అందించారు. టూరిస్టు ఆర్గనైజర్ వజ్రమణి చిత్తూరు మురకంబట్టుకు చెందిన వ్యక్తి. ఇతడి డైరీలో ఉన్న సమాచారం మేరకు టూరిస్టు బస్సులో 32 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు, ఒక వంటమనిషి వెళ్ళిన్నట్లు పోలీసులు గుర్తించారు. వంట మనిషి దొరబాబు మరణించారని ఇతడు తవనంపల్లి మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పలమనేరు మునినాయాణ శెట్టివీధికి చెందిన సునంద (50), శివశకంర్‌రెడ్డి (50) టూరిస్టు బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారిలో ఉన్నారు. పలమనేరు మృతుల కుటుంబ సభ్యులను పలమనేరు ఎంఎల్ఏ అమరనాథరెడ్డి , ఏరియా కౌన్సిలర్ కుమార్ పరామర్శించారు. గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. మృతదేహాల తరలింపుకు జిల్లా నుండి ఫ్రీజర్ బాక్స్‌లతో కలిపి 5 అంబులెన్స్‌లు ఏర్పాటు చేశామని, ప్రయాణికులను తిరిగి జిల్లాకు తీసుకురావడానికి రవాణా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

తిరుపతిలో శైలజరాణి (64)

బస్సు ప్రమాదంలో తిరుపతికి చెందిన మహిళ మతి చెందారు. తిరుచానూరు టెలిఫోన్ కాలనీకి చెందిన రిటైర్డ్ గ్రంథాలయాధికారిణి శైలజారాణి(64)గా గుర్తించారు. ఆమెకు తోడుగా వెళ్లిన రామస్వామి పిళ్లై దంపతులకు గాయాలై చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి

ఘోర రోడ్డుప్రమాద ఘటనలో మృతిచెందిన కుటుంబాలకు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్, సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతదేహాలను త్వరితగతిన వారివారి స్వస్థలాలకు చేరేలా చూడాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వాడ గంగరాజు విజ్ఞప్తి చేశారు. ప్రమాదంలో టిడిపి కార్యకర్త నాగేశ్వరరావు మృతిచెందడం బాధాకరమని ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్ అన్నారు. నగరానికి చెందిన మరో మహిళ శశికళ మృతిచెందారని, వారి అబ్బాయి అమెరికాలో ఉండగా సమాచారం అందించామన్నారు.

ఒక్కసారిగా బస్సు కుదుపునకు గురై పడిపోయింది

- షేక్ ముంతాజ్, చిత్తూరు

తీర్థయాత్రికులతో పాటుగా అన్ని ప్రాంతాలు చూడాలనే ఉత్సాహంతో నేను ముస్లిం అయినప్పటికీ నాతోటి వారితో యాత్రకు బయలుదేరాను. దురదృష్టవశాత్తు ఇలా జరిగింది నా చేయి విరిగిపోయింది. వెనుక వీపు భాగంలో ఎముకలు విరిగినట్లు వైద్యులు తెలిపారు. సర్వ మతాలు ఒకటే అంటూ సన్నిహితంగా ఉండే నా పొరుగువారు ఇలా దుర్మరణం పాలుకావడం నన్ను చాలా బాధించింది. ఈ బస్సు ఘటన వల్ల కుటుంబ పెద్దలను కోల్పోయాను. అసలు బస్సులో ఆ క్షణాన ఏం జరిగిందో కూడా అర్థం కాలేదు.

నా కళ్ల ఎదుటే భర్త చనిపోయాడు..

-ఎస్.నాగేశ్వరి, చిత్తూరు జిల్లా

నా కళ్ల ఎదుటే నా భర్తకు తీవ్ర గాయాలపాలై చనిపోయాడు. ఈ వయసులో నాకు దిక్కెవరు ? నేను ఎవరిని ఆశ్రయించాలి, నాకు నేను, నాకు ఆయన ఈ వృద్ధాప్యంలో తోడునీడగా ఉండే వాళ్లం. తీర్థయాత్రలకు వెళ్లి దైవదర్శనం చేసుకుని పుణ్యం సంపాదించుకుందామనుకునే సమయంలో ఇలాంటి దుర్ఘటన జరిగి నా జీవితంలో చీకటి మిగిల్చింది. మా బంధాన్ని విడదీసిన బస్సు ప్రమాదం మరి ఏ బంధాన్నీ విడదీయరాదు. మా ప్రాణాలను, మా జీవితాలను బస్సు ప్రమాదం ఇలా చీకటిమయం చేస్తుందని ఊహించలేదు.

ఏమైందో తెలుసుకునేలోగా తొమ్మిది మంది బలి

- పి.ప్రసాద్, డ్రైవర్

చింతూరు మండల కేంద్రానికి మరికొద్ది సేపట్లో చేరుకుంటామనగా ఈ ప్రమాదం జరిగింది. బస్సు లోయలో పడటంతో తొమ్మిది మంది దుర్మరణం పాలవడం నన్ను కలిచివేసింది. ఏం జరిగిందో తెలుసుకునేలోపే పలువురు కన్నుమూశారు. బస్సులో ఇద్దరు డ్రైవర్లమి ఉన్నాం. నాతోటి డ్రైవర్ బస్సు డ్రైవింగ్ చేస్తుండగా నేను విశ్రాంతి తీసుకుంటున్నాను. ఈ క్రమంలోనే హఠాత్తుగా బస్సు ఒక్కసారిగా కుదుపుకు గురై తలకిందులై లోయలో పడిపోయింది. ఈ ఘటనలో నా చేయి విరిగింది. వెన్నెముక దెబ్బతింది.



నాపై ముగ్గురి మృతదేహాలు

- వజ్రమణి, చిత్తూరు జిల్లా

ఒకసారిగా బస్సు పల్టీకొట్టడంతో వెనుక సీటులో ఉన్న నాపై ముగ్గురు వ్యక్తులు వచ్చి పడ్డారు. వారంతా మృతిచెంది కనిపించారు. బస్సు తలకిందులుగా ఉండటంతో బయటికి రావటానికి తీవ్రంగా కష్టపడ్డాం. ఎలాగోలా కిటికీలో నుండి బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నాను. నాతోటి ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడటంతో ఊపిరి ఆడక చనిపోయారు. నేను రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నాను. విశ్రాంత సమయం కావడంతో తీర్థయాత్రలకు వెళదామని మా చిత్తూరు గ్రామస్తులు అందరం కలిసి విఘ్నేశ్వర ట్రావెల్స్ బస్సును కిరాయికి మాట్లాడుకుని ఈ తీర్థయాత్రలకు బయలుదేరగా ఈ విధమైన దుర్ఘటన జరిగింది.

కేన్సర్‌పై అవగాహన పెంచాలి: కలెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని ప్రతి ఒక్కరికీ కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంలో కలెక్టర్ జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డిటి.సుధారాని, స్టార్ ఎన్‌సిడి టీం, ప్రోగ్రాం అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా 'ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిషన్' అవగాహన బ్యానర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ డిజిటల్ హెల్త్ మిషన్‌లో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ భద్రపరచడం, టెలి మెడిసిన్ ద్వారా ఆన్లైన్‌లో ఆరోగ్యసేవలు అందించాలని తెలిపారు. ముఖ్యంగా కేన్సర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు. మధుమేహం, రక్తపోటు, పక్షవాతం, కేన్సర్ వంటి వ్యాధులపై కల్పిస్తు 18 సంవత్సరాలు పైబడిన వారిలో ఇంటింటా పరీక్షలు జరిపి సకాలంలో త్వరితగతిన వ్యాధులు గుర్తించి నివారణ చర్యలు చేపడితే మరణాల శాతాన్ని నివారించవచ్చు అన్నారు. ఈ అసంక్రమణ వ్యాధులకు చికిత్స లేదని నివారణ ఒక్కటే మార్గమన్నారు. అడిషనల్ డిఎంహెచ్వో వెంకట ప్రసాద్, డాక్టర్ హనుమంతరావు, ఎన్సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ గిరి, ఏపీ డమాలజిస్ట్ శ్రీవాణి, స్టార్ ఎన్సిడి అధికారులు పాల్గొన్నారు.

మిని పార్కును ప్రారంభించిన ఎమ్మెల్సీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని ముద్దనపల్లి గ్రామంలో గురువారం రాత్రి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్.మునిరత్నం, ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, టిడిపి నేతలతో కలిసి మిని పార్కును ప్రారంభించారు. అనంతరం పలువురు వైసిపీ కార్యాకర్తలకు తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చొరవ తీసుకున్నారన్నారు. ఇల్లు లేని వారికి ఇల్లు నిర్మాణాలు, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు చిన్న చిన్న పరిశ్రమలతో బ్యాంకు రుణాల మంజూరు, పరిశ్రమలు ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు అందుతాయన్నారు. ఎంపీడీవో లక్ష్మి కాంత్, డాక్టర్ వెంకటేష్, కృష్ణా నాయక్, విశ్వనాథ్, మనోహర్, నాగభూషణం, రఘు, బాలు, వెంకటాచలం, మురళి, త్యాగరాజ్ పాల్గొన్నారు.

అంబులెన్స్ విరాళం

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వారు రూ.20లక్షలు విలువజేసే అంబులెన్స్ విరాళంగా అందజేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్ కుమార్ రెడ్డి, చేతుల మీదుగా అంబులెన్స్ తాళాలను దేవస్థానం చైర్మన్ మణి నాయుడుకి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ధనపాల్, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ విష్ణు చరణ్, కాణిపాకం మేనేజర్ శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలోని చవటపల్లి గ్రామం వద్ద కొన్ని సంవత్సరాలుగా తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలకు సంబంధించి శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు సిఐ గోపి తెలిపారు. జాతీయ రహదారిపై వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో రోజుల తరబడి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం సిఐ, తహశీల్దార్ రమేష్ బాబు రహదారి సిబ్బంది సమస్య స్థలాన్ని పరిశీలించారు. వర్షపు నీరు నిలువ కుండా వెళ్లడానికి ఉన్న మార్గాలను అందుకు తగిన పరిష్కారాలను అన్వేషించారు. గ్రామస్తుల సహకారాలతో సమస్యను అధికమించడానికి పై అధికారుల సలహాలు సూచనల మేరకు పరిష్కరిస్తామన్నారు. కొందరు రైతులు సహకరిస్తే ఈ సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందన్నారు. సంబంధిత రైతులతో మాట్లాడుతున్నామని తహశీల్దార్ తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉండాలి: పెద్దిరెడ్డి

ప్రజాశక్తి- పూతలపట్టు: ప్రజాప్రతినిధులు కార్యకర్తలకు అండగా నిలవాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి 50మంది కార్యకర్తలతో కలిసి శుక్రవారం మాజీ మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం మండల నాయకుల మధ్య నెలకొన్న విభేదాలపై సుదీర్ఘ చర్చలు జరిగినట్లు సమాచారం. పార్టీల్లో ఉన్న కారణంగా నష్టపోయిన ప్రతి కార్యకర్తను ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటామని పెద్దిరెడ్డి హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. సమస్యలుంటే జగదీశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని, వాటి పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. ఎంపీటీసీలు యతీష్, సిద్ధారెడ్డి, నాగరాజా, షణ్ముగం, సర్పంచి ఎమ్మెస్ మనీ, కో ఆప్షన్ నెంబర్ ఖాదర్ వల్లి, నాయకులు జీవరత్నం, రాజేంద్ర పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని ప్రభుత్వం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులో విద్యాప్రమాణాలను పెంచాలని ప్రత్యేక అధికారి వెంకటేశ్వరి అన్నారు. గురువారం 10వ తరగతి విద్యార్థులకు వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అరగొండ జెడ్‌పిహెచ్ఎస్ బాలుర పాఠశాల, తవణంపల్లి జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో బోధన, అభ్యసన పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు జిఎఫ్ఎల్ఎన్ 75 రోజుల కార్యక్రమంపై శిక్షణ ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణను ఎంఈవో పి.హేమలత, అదనపు ఎంఈవో ఎ.మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

కొనసాగుతున్న గజదాడులు

- నెరుకూరివారిపల్లెను వీడని ఏనుగులు
- నూర్పిడి కోసం ఉంచిన వడ్లను తిని, తొక్కి..
- బోరు పైపులు ధ్వంసం

పంట నూర్పిడి అనంతరం రాసి పోసిన వడ్లను చెల్లాచెదురు చేసిన ఏనుగులు

ప్రజాశక్తి- సోమల: గతవారం రోజులుగా ఏనుగుల గుంపు సోమల, ఇరికిపెంట పంచాయతీలలోనే తిరుగాడుతూ రాత్రి వేళల్లో రైతుల పంట పొలాల పై దాడులు చేసి రైతులకు తీరని నష్టం కలిగిస్తున్నాయి. మండలంలోని పేటూరు, అన్నెమ్మగారిపల్లి, పెద్ద ఉప్పరపల్లి, ఆవులపల్లి, నంజంపేట, 81 చిన్న ఉప్పరపల్లి, సోమల, ఇరికిపెంట 8 పంచాయతీల పరిధిలో నిత్యం ఏదో ఒకచోట ఏనుగులు సంచరిస్తూ పంట నష్టం కలిగించడం జరుగుతూనే ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా ఏనుగుల సమస్య సమస్యగానే మిగిలిపోయిందని రైతులకు మాత్రం నష్టం తప్పడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. కొన్ని పంచాయతీలలో అటవీ సమీప వ్యవసాయ భూములను రైతులు సాగు చేయకుండా బీడు భూములుగానే వదిలేస్తున్నారంటే సమస్య తీవ్రత ఎలా ఉందో అర్థమవుతోంది. పంటలు సాగు చేయడం తీరా చేతికి అందే సమయానికి ఏనుగులు ధ్వంసం చేయడం కారణంగా వ్యవసాయం చేయడమే దండగా అనుకుని రైతులు భూములను బీడు భూములుగా మార్చి వేస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితులలో రైతులు, గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. పలు సందర్భాల్లో ఏనుగులు మనుషుల ప్రాణాలను తీయడం, విద్యుత్ తీగల తగిలి ఏనుగులు కూడా మృతి చెందడం వంటి ఘటనలు కూడా జరుగుతూనే ఉన్నాయి.

మూడు ఏనుగుల గుంపు తాజాగా సోమల పంచాయతీ నెరుకూరివారిపల్లె గ్రామంలో గురువారం అర్ధరాత్రి గ్రామ సమీపంలోని బండపై పంట నూర్పిడి కోసం రాసి పోసి ఉన్న వడ్లను తొక్కి వేసి సమీపంలోని బోరు పైపులను ధ్వంసం చేశాయి. శుక్రవారం ఉదయం గ్రామస్తులు గ్రామసమీపానికి వెళ్లి చూడగా ఏనుగులు తిరగాడిన ఆనవాలు కనిపించింది. పంట నూర్పిడి చేసుకుందామనుకున్న రైతులకు బండపైకి వెళ్లి చూడగా ఏనుగులు ట్రాక్టర్‌పై ఉన్న వరి పంటను తిని, బండపై ఉన్న దాన్యంను తొక్కివేయడాన్ని చూసి రైతులు కళ్ళనీళ్ల పెట్టుకున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటలు ఇంటికి చేరే లోపే ఏనుగులు నాశనం చేశాయని వాపోయారు. గత కొన్నేళ్లుగా ఏనుగుల వలన ప్రాణ, ఆస్తి, పంటలను నష్టపోతున్నామని, శాశ్వత పరిష్కారం కోసం అటవీశాఖ అధికారులను ఎన్నిసార్లు కోరిన వారి నుండి సరైన స్పందన లేకపోవడం దారుణమని వాపోయారు. జరిగిన పంట నష్టంపై అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చినా కూడా శుక్రవారం సంఘటన స్థలానికి రాలేదని తెలిపారు.

ఎస్సైని సన్మానించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై తేజస్విని టిడిపి మండల అధ్యక్షులు ఎం.చెంగల్రాయ యాదవ్, ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్యే సోదరులు వి.రాజ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కలిసి శాలువ కప్పి సన్మానించారు. టిడిపి నాయకులు రాజేందర్ రెడ్డి, హేమంత్ కుమార్‌రెడ్డి, జగన్నాథం, సోము, మురళి మోహన్, కె.సందాని, లక్ష్మణరాజు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని చదువుకున్న యువతీ యువకులు మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 13వతేదీ శనివారం ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సహకారంతో ఎస్ఆర్.పురం మండలం పుల్లూరు క్రాస్‌లో గల ఎస్ఎల్వి కళ్యాణ మండపంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారని తెలిపారు. మండలంలో చదువుకున్న యువతీ యువకులందరు జాబ్ మేళాకు హాజరై ఉద్యోగావకాశాలు పొందాలని కోరారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనెల 14వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య సేవసంస్థ నిర్వాహకులు శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతుందని, చెన్నై శంకర్ నేత్రాలయ వైద్యనిపుణుల సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉచిత కంటి పరీక్షలు, అవసరమైన చికిత్స సూచనలు పొందాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి- యాదమరి: పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచాలని, విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల పెంచడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారులు రుక్మిణి, ప్రసాద్ కోరారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలను నూతన ఎస్టీయూ మండలశాఖ మర్యాదపూర్వకంగా కలిసి ఎంఈవోలను సన్మానించారు. ఎస్టియు చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షులు మదన్ మోహన్‌రెడ్డి, మండలశాఖ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం పిళ్ళై, ప్రధాన కార్యదర్శి రంగనాథం, గౌరవాధ్యక్షులు గుణశేఖరన్, మహిళా కన్వీనర్ ఉమ పాల్గొన్నారు.

17న తలనీలాల వేలం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని మొగిలి గ్రామంలో స్వయంభుగా వెలిసిండు శ్రీ కామాక్షి సమేత మొగులేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 17 బుధవారం ఉదయం 10.30 గంటలకి స్వామివారికి భక్తులు సమర్పించు తలనీలాల వేలం జరుగుతుందని వంశపార ధర్మకర్త విజయ్ కుమార్, ఆలయ కార్యనిర్వహణ అధికారి మునిరాజులు తెలిపారు. ఆసక్తి గలవారు రూ.10 వేలు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనాలని, వేలం పాడిన వెంటనే ధరావత్తు సొమ్ము చెల్లించి తగిన రసీదు పొందాలని తెలిపారు. వేలం గెలుపొందిన వారు 2026 జనవరి నుండి డిసెంబర్ వరకు ఒక సంవత్సరం పాటు తలనీలాలు పోగు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

సీఎంను కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి- రామకుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని మండల టిడిపి నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలో శుక్రవారం రామకుప్పం మండల టిడిపి అధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి కామరాజు నాయక్ రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడును కలిసి మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాలను వివరించారు. పార్టీ అభ్యున్నతికి, పథకాల అమలు తీరు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, చైతన్యం తీసుకురావాలని దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. శాంతిపురం మండల అధ్యక్షుడు నందిగం ఉదయ్, ప్రధాన కార్యదర్శి మంజునాథ్ గౌడు పాల్గొన్నారు.

నూతన తాగునీరు పైపులు ఏర్పాటు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: తాగునీటి సమస్యల పరిష్కారం కోసం నూతన తాగునీటి పైపు ఏర్పాటు చేసినట్లు సర్పంచి ద్రాక్షాయని తెలిపారు. శుక్రవారం మండలంలోని గుంతూరు పంచాయతీలో గల దళితవాడలో తాగునీరు సరిగా అందడం లేదని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు నూతనంగా పైప్ లైన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భాష్యం వంశి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు యుటిఎఫ్‌తో పరిష్కారం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం యుటిఎఫ్‌తోనే సాధ్యమవుతుందని యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో యుటిఎఫ్ సమావేశం మండల అధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేసిన పలు పోరాటాల ఫలితంగా ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుండి అందాల్సిన బకాయిలు సాధించకున్నామని అన్నారు. జిల్లా కార్యదర్శి సరిత, మాజీ సభ్యులు సాంబశివ, కార్యదర్శి మోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు మొగిలయ్య, కృష్ణయ్య, మాధవనాయుడు, బాలాజీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్ రెడ్డి

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సాంకేతిక యుగంలో ప్రతి ఉపాధ్యాయుడు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని నాగార్జున ఐఎఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలో ఓడిఐఎస్ఐ కార్యక్రమం అమలపై విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ మౌలిక వసతులను ఏర్పాటు చేసి, ఉపాధ్యాయులకు విద్యార్థులకు సాంకేతికత ఆధారిత విద్య అందించడానికి రూపొందించిన కార్యక్రమని పేర్కొన్నారు. జిల్లాలోని కుప్పం, పలమనేరు ప్రాంతాలలో 7మండలాలలోని 22 పాఠశాలల్లో ఓఎస్ఏటి వారి ఆర్థిక సహకారంతో రాష్ట్రీయ సేవాసమితి సంస్థ వారు ఓడిఐఎస్ఐ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. గ్రామీణ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు డిజిటల్ పరికరాలు, విద్యార్థులకు టాబ్లెట్లు, లెర్నింగ్ సాధనాలు, స్కూల్ పనితీరును డేటా ఆధారంగా అంచనా వేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ పీడీ వెంకట రమణ, రాస్ ప్రతినిధి రమేష్ రెడ్డి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి: ఎంపీపీ

ప్రజాశక్తి -ఎస్ఆర్.పురం: మండల ప్రజాపరిషత్ సర్వసభ సమావేశం శుక్రవారం ఎంపీపీ సరితా, ఎంపీడీవో వనజ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ సరిత మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, మండలంలో నెలకొన్న ప్రజాసమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మండల విద్యాధికారి 2 సబర్మతి మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులు బస్‌స్టాప్‌లో నిలపకుండా వెళ్ళిపోతున్నాయని విద్యార్థులకు, మహిళలకు బస్సు ప్రయాణం చాలా ఇబ్బందికరంగా ఉందని ఆర్టీసీ అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కారం చేయాలని కోరారు. మండలస్థాయి అధికారులు మండలంలో అభివృద్ధి వివరాలను శాఖల వారీగా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి తహసిల్దార్ లోకనాథ పిల్లై, పశువైద్యాధికారి శ్రీవిద్య పాల్గొన్నారు.

పురం మండలం, చిత్తూరు జిల్లా

21న 'పల్స్ పోలియో'ను విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ మోహన్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాల వయసు గల ప్రతి బిడ్డకు పోలియో చుక్కలు వేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన కుమార్ తెలిపారు. శుక్రవారం చిత్తూరు జిల్లా సచివాలయం జిల్లాలోని వివిధ డిపార్ట్మెంట్ అధికారులతో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. డీఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 221502 మంది ఐదు సంవత్సరల లోపు పిల్లలు ఉన్నారని, వీరందరికీ 14,730 పోలియో వయిల్స్ అవసరమన్నారు. 142 రూట్లలో 5794 బూత్స్ ద్వారా పల్స్ పోలియో వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని సిడిపివోలు, ఎంఈవోలు, వైద్యాధికారులు పర్యవేక్షిస్తారని, పోలియో బూత్‌లలో ఎంఎల్‌హెచ్ పిలు, ఆశాలు, అంగన్వాడీ కార్యకర్తలు ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమం మూడు రోజులపాటు జరుగుతుందని తొలిరోజు బూత్‌లో 2,3 రోజుల్లో ఇంటింటికీ వెళ్లి మార్క్ చేస్తూ మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు. డిఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ డిటి సుధారాణి, డిఐఓ డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ వెంకటప్రసాద్, డిఆర్‌డీఏ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: ఈనెల 21వ తేదీ ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహశీల్దార్ లోకనాథపిళ్ళై, ఎంపీడీవో వనజ, మండల స్థాయి అధికారులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ పల్స్ పోలియో బ్యానర్ విడుదల చేశారు. ఆరిమాకులపల్లె వైద్య అధికారి బాలాజీ చరణ్, ల్యాబ్ అసిస్టెంట్ షణ్ముగం పాల్గొన్నారు.

తవణంపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 21వ తేదీ ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రతి ఇంటికీ వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని మండల వైద్యాధికారి డాక్టరు ప్రియాంక, డాక్టరు మోహన వేలు, డాక్టరు కేశవ నారాయణ తెలిపారు. సిహెచ్ఓ జ్ఞానశేఖర్, పిహెచ్ఎన్ జీవకళ, ఐసిడిఎస్ పర్యవేక్షకులు నాగరత్నం, లావణ్య పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై అవగాహన పెంచాలి

డిప్యూటీ ఎంపీడీవో

ప్రజాశక్తి- పుంగనూరు: ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించడం చాలా ముఖ్యమని నీటి సంరక్షణపై అవగాహన పెంచాలని డిప్యూటీ ఎంపీడీవో సుధాకర్ రావు అన్నారు. వాటర్ షెడ్ మహోత్సవ కార్యక్రమం మంగళం వాటర్ షెడ్, మేలుందొడ్డి మైక్రో వాటర్ షెడ్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ షెడ్ మహోత్సవం అంటే సహజంగా వర్షపు నీరు చేరే ప్రాంతం అలాంటి ప్రాంతంలో నీటిని నిల్వ చేయడం వనరులను సమర్థవంతంగా వినియోగించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించడమేనని అన్నారు. నీటినిల్వ నిర్మాణాలను మెరుగుపరిచేందుకు వాటర్షెడ్ మహోత్సవం ఒక పెద్ద జాతీయ మహోత్సవంగా జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీ శివశంకర్, వాటర్ షెడ్ అధికారి పి. ధనుంజయ వర్మ, సర్పంచ్ రాజారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ రెడ్డప్ప రెడ్డి, వెంకటరమణ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఆర్.శ్రీనివాసులు రెడ్డి



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి పంచాయతీకి చెందిన సీనియర్ నాయకుడు ఆర్.శ్రీనివాసులు రెడ్డిని వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ తనకు ఇంతటి గౌరవం ఇచ్చినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో మండల, జిల్లా వ్యాప్తంగా పర్యటించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు: సిఐ

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం గ్రామ దేవత శ్రీబంగారమ్మ జాతర వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతప్ప తెలిపారు. శుక్రవారం జాతర ఏర్పాట్లను సిఐ సిబ్బందితో కలిసి పరిశీలించారు. సిఐ మాట్లాడుతూ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు భద్రత కల్పించడం జరిగిందన్నారు. భక్తులకు ఇబ్బంది కలిగించినా, అల్లర్లకు పాల్పడినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా వారిపై రౌడీ షీటర్ నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ తేజశ్వనితో కలసి గ్రామవీధుల్లో విహరిస్తున్న ఊరేగింపును పర్యవేక్షించారు. ఆలయ అధ్యక్షులు కె.ప్రసాద్ పాల్గొన్నారు.

అన్నా.. అంటావా..!

కార్మికుడిపై లాఠీ ఝుళిపించిన పోలీసులు

ప్రజాశక్తి- పుంగనూరు: పోలీసులు తనిఖీలు చేస్తుండగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఓ కార్మికుడు పోలీసులను అన్న అని పిలిచాడని పోలీసులు లాఠీ జులిపించారు. ఈ వింత పోకడ పుంగనూరు -కర్ణాటక సరిహద్దు వద్ద చోటు చేసుకున్నది. వివరాలు ఇలా... పెద్దపంజాణి మండలానికి చెందిన పోలీసులు రాసపల్లి సమీపంలోడ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు గురువారం సాయంత్రం చేపట్టారు. ఓ దినసరి కూలీ పనులు ముగించుకుని మద్యం తాగి స్నేహితుని వాహనంలో వెనుక వైపు కూర్చుని వస్తున్నాడు. పోలీసులు వాహనం ఆపి ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి మద్యం తాగలేదని నిర్ధారించారు. అయితే వెనుక వైపు ఉన్న వ్యక్తి మద్యం తాగి ఉన్నాడని ప్రశ్నించారు. అన్నా నేను కూలి పనికి వెళ్లి తిరిగి వస్తున్నానని మద్యం తాగానని, వారికి మర్యాదపూర్వకంగా విన్నవించుకున్నాడు. అయితే పోలీసులు మాత్రం మమ్మల్ని అన్న అని అంటావా అంటూ ఓ కానిస్టేబుల్ లాఠీతో చితక్కొట్టాడు. అక్కడున్న వారికి ఎందుకు కొడుతున్నాడో అర్థం కాక చూస్తుండిపోయారు. మరి కొంతమంది ఇది మంచి పద్ధతి కాదని, దినసరి కూలీగా కష్టపడి అతని సొంత డబ్బుతో మద్యం తాగాడని, తాగి వాహనం నడిపితే తప్పుకానీ వెనుక కూర్చొని ప్రయాణించా తప్పే అని ప్రశ్నిస్తున్నారు. సదరు కార్మికుడు పోలీసులతో మర్యాదగా మాట్లాడిన సార్ అని పిలవాలంటూ ఇలా దౌర్జన్యం చేయడం ఒకింత ఆశ్చర్యాన్ని గురయ్యారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి - రొంపిచెర్ల: మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామని ఎస్ఐ మధుసూదన్ తెలిపారు. ఎస్ఐమాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని డ్రోన్ నిఘా ఉంచుతున్నామని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధమని, గ్రామాల్లో పేకాట, కోడిపందేలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. గానుగచింత, మోటుమల్లెల, పెద్దమల్లెల, చెంచమరెడ్డిగారిపల్లి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. ప్రజలకు ఏవైనా సమస్యలుంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. హెడ్ కానిస్టేబుల్స్ ఏలుమలై రెడ్డి, చంద్రశేఖర్, కానిస్టేబుల్ కృష్ణమూర్తి, శోభన్ బాబు పాల్గొన్నారు.

ఎస్సైని కలసిన వైసీపీ నేతలు

ప్రజాశక్తి- సోమల: సోమల నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రమేష్‌ను వైస్ ఎంపీపీ ప్రభాకర్, మండల వైసిపి అధ్యక్షులు గంగాధర్ రాయల్, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ శ్రీరాములు, ఎస్ నడింపల్లి సర్పంచ్ వెంకటరమణ, సీనియర్ నాయకులు వరదం వెంకటరమణ, సాంబయ్య, మునిరాజా, బగ్గిడి నాగరాజా శుక్రవారం స్టేషన్లో మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు.

అపహాస్యం చేస్తున్న ఆర్టీఐ యాక్ట్

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : సమాచారం తెలుసుకోవడం కోసం ప్రభుత్వం పెట్టిన సమాచార హక్కు చట్టం వివరాలు కోరేవారిని అపహాస్యం చేస్తోందని, అడిగిన సమాచారం అందించక అధికారులు మాటదాటవేస్తున్నారని వైస్ ఎంపీపీ కన్నియప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. మండలంలో ఎన్ని క్వారీలకు అనుమతిచ్చారు, ఎంత విస్తీర్ణం ఇచ్చారు, ఎవరెవరికి ఇచ్చారు, అప్రూవల్ ఏ తేదీల్లో ఇచ్చారన్న విషయాలను సమాచార హక్కుచట్టం ద్వారా తహశీల్దార్‌ను కోరడం జరిగిందన్నారు. దీనిపై సమాచారం ఇవ్వడానికి నెలరోజుల సమయం తీసుకున్న అధికారులు అరకొరగానే సమాచారం అందించారని, దీంతో అప్పిలేట్‌కు వెళ్లామని ఆ మేరకు శుక్రవారం ఆర్డీవో కోర్టుకు రమ్మన్నారన్నారు. వివరాల కోసం ఆర్డీవో కార్యాలయానికి వస్తే క్వారీల తరపున న్యాయవాది హాజరై వివరాలు వెల్లడించలేమంటో కొన్ని సెక్షన్లు చెప్పి వెళ్లిపోతే తాము అడిగిన సమాచారం ఎవరిస్తారన్నారు. దీనిపై ఆర్డీవో అనుపమను వివరాలు కోరామని సంబంధిత వివరాలు మైన్స్ కార్యాలయానికి వెళితే లభిస్తుందని సమాధానమిస్తున్నారని అన్నారు. ఒక ప్రజా ప్రతినిధికే సమాచారం పొందడం ఇంత కష్టమైతే సాధారణ ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఎందుకు రెవెన్యూ అధికారులు పారదర్శకత పాటించడంలో వెనకడుగు వేస్తున్నారన్నారు. ప్రజా ప్రయోజనాల దష్ట్యా, కోరిన సమాచారాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

IN THE COURT OF THE PRINCIPLE CIVIL JUDGE (JUNIOR DIVISION) OF CHITTOOR
O.S.No: 341/2025

Between
K.Subramanyam Naidu ...Plaintiff.
And
M.Ravi Kiran ...Defendant.

SUIT SUMMONS TO THE DEFENDANT

To
M.Ravi Kiran S/o late M.Balakrishna, Hindu, Employee, Aged about 50 years, Resident of D.No: 22-949/1, Muruganipalle, Kongareddipalle area, Chittoor town & district. Working in Commercial Tax office, Kattamanchi,Chittoor town & district
Sir,

Please take notice that the above suit was filed by the plaintiff against you for recovery of the suit amount and the said matter is posted to **22-12-2025** for your appearance in the said court. Please be present on **22-12-2025** at **10-30 a.m** before the said court either in person or through your advocate. Otherwise, the matter will be decided exparte.

Sd/- **V.LOKANADHA NAIDU**
Advocate for Plaintiff
Place: Chittoor, Date:10-12-2025.

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (SENIOR DIVISION), CHITTOOR
I.A.No.231 of 2025
O.S.No.527 of 2014

1. M.Bakki Reddy (died)
2. K.Pattabhi Reddy
.. Petitioners/Plaintiffs

-versus-
M.Anki Reddy (died) & others
...Respondents

NOTICE TO 6TH RESPONDENT

To
Smt.K.Rupa w/o K.Purushotham Reddy, Peddakuntapalli village, Nandanur post, G.D.Nellore Mandal, Chittoor District.
Sir,
Please take notice that the petitioners/ plaintiffs have filed the above I.A. requesting this Hon'ble court to permit them to bring the other legal heirs of 1st defendant i.e., Smt.K.Rekharani and Smt.K.Rupa as defendants 5 and 6 in the above suit. The said IA is posted to **22.1.2026** for your appearance. If you have got any objection you may appear on **22.1.2026** at 10.30 A.M. either in person or through an Advocate and file your objections. If you fail to do so the matter will be decided ex-parte.

SRI M.SUBRAMANYAM REDDY
, Advocate for Petitioners/Plaintiffs
Place: Chittoor, Date:12-12-2025.

శ్రీ ఓంకార ధ్యాన మందిరం
దేవాదాయ ధర్మదాయ శాఖ,
డి.ఐ రోడ్, చిత్తూరు

బహిరంగ వేలము ప్రకటన

చిత్తూరు జిల్లా, చిత్తూరు పట్టణం, డి.ఐ.రోడ్డు నందు వెలసియుండు శ్రీ ఓంకార ధ్యానమందిరమునకు సంబందించిన **డోర్‌నెం.10-221** (గాంధీ రోడ్డు) విస్తీర్ణం 25×12 అడుగులు మరియు **డి.నెం.10-306 & 307** (డి ఐ రోడ్డు)- ఖాళీ స్థలం 3 సంవత్సరముల బాడుగకు **15-12-2025** సోమవారం ఉదయం 11.00 గంటలకు శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానము వద్ద దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షములో వేలము పాట జరుగును. వేలములో పాల్గొన దలచిన వారు షరత్తుల కొరకు పై చిరునామాలో సంప్రదించ వచ్చును.

డి.వెంకటరాయులు
కార్యనిర్వహణాధికారి

IN THE COURT OF THE IX ADDL. DISTRICT JUDGE OF CHITTOOR
I.A. No. 46 OF 2023
AS.No. 51 OF 2017
OS NO. 328 OF 2013

Between:
M.Babu @ Venugopal Naidu & others
...Petitioners/Appellants
And:
M.Narasimhulu Naidu & another
...Respondents

NOTICE TO RESPONDENTS 7 & 8

To
7. Smt. Bharathi, W/o Bhaskar Naidu,
8. Smt. Dharani, W/o Suri,
Both are residing at Pulliahgaripalli Village, Madhavaram Post, Yadamari Mandal, Chittoor District-517 422.
Sir, Please take notice that the petitioners have filed petition under **ORDER 22 RULE 4 & 5 & Sec.151 of C.P.C. and Rule 28 of C.R.P** to bring the legal representatives of deceased 2nd Respondent i.e N. Kuppaiah Naidu on record as Respondents 3 to 8 in the above appeal. If you have got any objection you may appear before this Court at **10.30 A.M**., on **08-01-2026** either in person or through an advocate and file your objection. If you fail to do so, the matter will be decided exparte.

Sd/-**V.RAMANARAYANA REDDY**
Advocate for Petitioners
Place: Chittoor, Date:12-12-2025.

IN THE COURT OF THE IX ADDL. DISTRICT JUDGE OF CHITTOOR
I.A. No. 45 OF 2023
AS.No. 51 OF 2017
OS NO. 328 OF 2013

Between:
M.Babu @ Venugopal Naidu & others
...Petitioners/Appellants
And:
M.Narasimhulu Naidu & another
...Respondents

NOTICE TO RESPONDENTS 7 & 8

To
7. Smt. Bharathi, W/o Bhaskar Naidu,
8. Smt. Dharani, W/o Suri,
Both are residing at Pulliahgaripalli Village, Madhavaram Post, Yadamari Mandal, Chittoor District-517 422.
Sir, Please take notice that the petitioners have filed petition under **ORDER 22 RULE 9 & Sec.151 of C.P.C. and Rule 28 of C.R.P** to bring the legal representatives of deceased 2nd Respondent i.e N. Kuppaiah Naidu on record as Respondents 3 to 8 in the above appeal. If you have got any objection you may appear before this Court at **10.30 A.M.**, on **08-01-2026** either in person or through an advocate and file your objection. If you fail to do so, the matter will be decided exparte.

Sd/-**V.RAMANARAYANA REDDY**
Advocate for Petitioners
Place: Chittoor, Date:12-12-2025.

క్రికెట్‌లో నగరి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- విజయపురం (నగరి): అండర్ –17 క్రికెట్ క్రీడలో నగరి పీసీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఆఫీస్ అసిస్టెంట్ షిప్ ఒకేషనల్ కోర్సు విద్యార్థి సాకి సిద్ధూ ప్రతిభ కనభరిచారు. చిత్తూరు మెసానికల్ క్రీడా ప్రాంగణంలో జరిగిన అండర్ 17 బాలుర క్రికెట్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనభరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో పాటు చిత్తూరు జిల్లా జట్టుకు కెప్టెన్‌గాను ఎంపికయ్యాడు. ప్రతిభ కనభరచిన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ కోట వెంకటా చలపతి, అధ్యాపక బృందం అభినందించారు. కృష్ణా జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో సాకి సిద్ధూ పాల్గొనున్నాడు.

మధ్యాహ్న భోజన నిర్వహణ పరిశీలన

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : మున్సిపల్ పరిధి పుదుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణలో మౌలిక వసతులను, భోజన నాణ్యతను డీఎస్‌వో శరవణ శుక్రవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సరుకులు చిక్కి, కోడిగుడ్డు, బియ్యానికి సంబంధించిన అన్ని విషయాలను పరిశీలించి దానికి సంబంధించిన రిజిస్టర్‌లను తనిఖీ చేసి సక్రమంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పదవ తరగతి విద్యార్థుల వద్ద జరుగుతున్న పరీక్షల గురించి తెలుసుకొని అందరూ వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా బ్లడ్ క్యాంప్‌కు అనూహ్య స్పందన

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం ఏరియా ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా బ్లడ్ క్యాంపు ప్రజల నుండి స్పందన వచ్చిందని లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేష్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ అవశ్యకత ఎంతో ఉందని, ఆస్పత్రి యాజమాన్యంతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రక్తదాన శిబిరంలో యువత, వివిధ కళాశాలల నుండి వచ్చిన విద్యార్థులు పాల్గొనడం అభినందించదగ్గ విషయమని ఆస్పత్రి వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విశ్వనాథ్ ఇమ్స్, డాక్టర్ శ్యామలాదేవి ఆర్ఎంఓ, డాక్టర్ హరిప్రియ, లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ సుదర్శన్, సెక్రటరీ శివ తేవర్, వైస్ ప్రెసిడెంట్ సెల్వం, డైరెక్టర్ సెంథిల్ కుమార్, సతీష్, పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి: ఎంఈవో

ప్రజాశక్తి- సోమల: పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ నిర్ణయించిన 100 రోజుల ప్రణాళికలో ప్రత్యేక తరగతులలో తప్పకుండా హాజరై పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణులు కావాలని సూరయ్య గారి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులను ఎంఈఓ విజయకుమారి కోరారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక తరగతులను ఆమె పరిశీలించి ఉపాధ్యాయులకు విద్యార్థులకు సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మండల అకడమిక్ మానిటరింగ్ టీం తనిఖీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్:

తిరుపతి ఎంఆర్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అకడమిక్ మానిటరింగ్ టీం శుక్రవారం తనిఖీ చేపట్టింది. ఈ టీమ్‌కు తిరుపతి పట్టణ ఎంఇఒ భాస్కర్ నాయక్ కన్వీనర్‌గా, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు హరినాథ్‌రెడ్డి, మునిచంద్ర, ప్రతి సబ్జెక్టుకు ఒక ఉపాధ్యాయుడు చొప్పున సభ్యులుగా ఉంటూ తనిఖీ చేశారు. ప్రతి తరగతిలోని విద్యార్థుల నోట్ బుక్స్ ను, అసెస్మెంట్ బుక్స్ ను, మార్కుల వివరాలను, విద్యార్థులు వెనుకబాటుకు గల కారణాలను పరిశీలన చేశారు. ఇందులో భాగంగా రఘునాథ్, మహాలక్ష్మి, శేఖర్ బాబు, వరలక్ష్మి, వసుంధర సబ్జెక్టు ఉపాధ్యాయులుగా తనిఖీ చేశారు.అనంతరం ఎంఇఒ బాలాజీనాయక్ మాట్లాడుతూ సి, డి గ్రేడ్ విద్యార్థుల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని ప్రతి ఒక్కరికి చదవడం, రాయడం రావాలని సూచనలు చేశారు.

స్పోర్ట్స్ సిటీకి 28.37 ఎకరాల భూమి కేటాయింపు

ప్రజాశక్తి - తిరుపతి సిటి: తిరుపతి దామినేడు వద్ద ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థకు 28.37 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలోనే శాప్ ఛైర్మన్ రవినాయుడు తిరుపతిలో క్రీడాభివృద్ధికి భూమి కేటాయించాలని సిఎం, డిప్యూటీ సిఎం, ఐటి శాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే భూ కేటాయింపులు జరిగాయి. తిరుపతిని స్పోర్ట్స్ కేంద్రంగా మారుస్తామని, త్వరలోనే స్పోర్ట్స్ సిటీని నిర్మించడానికి శ్రీకారం చుడతామని రవినాయుడు చెప్పారు.

క్రీడా పరికరాలు, పోర్టబుల్ జనరేటర్లు వితరణ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం :

శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని జపనీస్ కంపెనీస్ గ్రూప్ , టి హెచ్ కె పరిశ్రమలు తమ కార్పొరేట్ సామాజిక భాద్యత చర్యల్లో భాగంగా శుక్రవారం వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించారు.

సత్యవేడు మండలం చెరివి, వరదయ్యపాలెం మండలం నాగానందపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు జపనీస్ కంపెనీస్ గ్రూప్ రూ. 2 లక్షల విలువైన క్రీడా పరికరాలు అందచేసింది. ఇందులో చిన్న పిల్లలు ఆరుబయట ఎంతో ఇష్టంగా ఆడుకునే ఊయల, స్వింగ్, సీసా వున్నాయి. ఈ కార్యక్రమంలో జపనీస్ కంపెనీస్ గ్రూప్ ప్రతినిధులు తకేషి ఒగావా (మియామా ఎలక్ట్రిక్ ఇండియా), మగోషి (ఆల్సోక్), తోమిటా (ఐసాన్), ఉచిదా (డైకి అల్యూమినియం), కొమోరి (డైకి అల్యూమినియం), రాజీవ్ (ఐఎంపి) హాజరై విద్యార్థులను ఉత్సాహపరుస్తూ ఆటల్లో పాల్గొన్నారు.

కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ ది జబర్దస్త్ షో..!

రాబోవు రెండేళ్లలో కుప్పంలో 40 వేల ఉద్యోగాలు
ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం

మెడికల్ కళాశాలలో ప్రైవేటీకరణకు సంబంధించి కుప్పంలో వైసిపి వాళ్ళు ఎక్కడ సంతకాల సేకరణ చేపట్టకపోయినా 63,000 మంది సంతకాలు పెట్టారని ఎమ్మెల్సీ భరత్ చెప్పడం హాస్యాస్పదమని, జబర్దస్త్ షోను తలపించేలా ఎమ్మెల్సీ భరత్ కుప్పం నుంచి కామెడీలు చేస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ విమర్శించారు. కుప్పం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను పిపిపి మోడల్‌లో చేస్తుంటే వైసిపి లేనిపోని రాద్ధాంతం చేస్తుందని మండిపడ్డారు. కుప్పంలో సంతకాల సేకరణ చేపట్టామని ఎమ్మెల్సీ భరత్ పేర్కొనడం కామెడీ షోను తలపిస్తోందని వైసీపీ నేతలు అవాస్తవాలు మాట్లాడడం మానుకోవాలన్నారు. 2024 ముందు కుప్పంలో చేపట్టిన అభివృద్ధి పనుల కన్నా 2025 నుండి కుప్పంలో అనేక అభివృద్ధి పనులు పరుగులు పెడుతుందని ఇప్పటికే హంద్రీనీవా ద్వారా కుప్పం నియోజకవర్గంలోని చెరువులు జలకల సంతరించుకోగా నియోజకవర్గంలోని అన్ని చెరువులను కృష్ణా జలాలతో నింపుతామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే హంద్రీనీవా పనులను పూర్తి చేసిన ఘనత సీఎం చంద్రబాబుకి దక్కుతుందన్నారు. రాబోవు రెండేళ్లలో కుప్పం నియోజకవర్గంలో 30 నుండి 40 వేల ఉద్యోగాలు రానున్నాయని ఇక్కడి నిరుద్యోగ యువతకి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైసిపి హయాంలో కుప్పం నియోజకవర్గంలో విచ్చలవిడిగా గ్రానైట్ అక్రమ రవాణా ద్వారా దోచుకున్నారన్నారు. నియోజకవర్గంలో 11 ఆలయాల అభివృద్ధికి 54 కోట్లను సీఎం చంద్రబాబు కేటాయించాలని ఆలయ అభివృద్ధి పనులు వేగంగా జరగాలని స్థానికంగా ఉంటున్న వారిలో గ్రానైట్ను తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరైనా ఆలయాలకు అభివృద్ధి పేరుతో అక్రమంగా గ్రానైట్ తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

63 మంది కూడా సంతకాలు చేయలేదు: ప్రతాప్

మెడికల్ కళాశాలల విషయంలో వైసీపీ చేపట్టిన సంతకాల సేకరణలో కుప్పం నియోజకవర్గంలో 63 వేల మంది సంతకాలు చేశారని ఎమ్మెల్సీ భరత్ పేర్కొనడం విడ్డూరంగా ఉందని కనీసం 63మంది కూడా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు చేశారా అని ప్రశ్నించారు. గత వైసిపి హాయంలో హంద్రీనీవా పై ఎందుకు సంతకాల సేకరణ చేపట్టలేదని, కుప్పం రెస్కోలో గత వైసిపి హయాంలో డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇవ్వలేదా అంటూ ప్రశ్నించారు. కుప్పంలో ఉనికిని చాటుకునేందుకు వైసిపి ఆరాటపడుతోందన్నారు.

63 వేల మంది సంతకాలు చేశారని నిరూపిస్తే రాజీనామా

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కుప్పం నియోజకవర్గంలో 63,000 మంది సంతకాలు చేపట్టారని రుజువు చేస్తే టిటిడి బోర్డుకు రాజీనామా చేస్తామని రుతువు చేయకపోతే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తావా అంటూ టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం సవాల్ విసిరారు. సీఎం చంద్రబాబుపై నోటికి వచ్చినట్లు మాట్లాడితే కుప్పంలో అడుగుపెట్టనివ్వమంటూ ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్, స్కిల్ బోర్డ్ డైరెక్టర్ హేమంబర్ గౌడ్, కార్పొరేషన్ డైరెక్టర్ బాబు, మండల అధ్యక్షులు రాజగోపాల్, సుబ్బు, సర్పంచ్ సంతోష్ వల్లేప్ప, గిరి, విష్ణు, పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

దివ్యాంగ విద్యార్థులకు క్రీడాపోటీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: దివ్యాంగ పిల్లలకు చదువుతో పాటు క్రీడలలో కూడా ప్రోత్సహించాలనే సంకల్పంతో పారా ఒలంపిక్ క్రీడా పోటీలు జిల్లా స్థాయిలో సమగ్ర శిక్షా వారు మెసానికల్ గ్రౌండ్ శుక్రవారం ఉదయం 9 గంటలకు నిర్వహించారు. సమగ్ర శిక్షా ఏపీసి మద్దిపట్ల వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి రాజేంద్ర ప్రసాద్, జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఉదయభాస్కర్ జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఇందులో అండర్ 17, అండర్ 20 విభాగాలలో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు , 1500 మీటర్లు పరుగు పందెం, జావలిన్ త్రో, షాట్ పుట్, హై జంప్, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు.

విజయపురం (నగరి): నగరి దివ్యాంగుల యూనిట్ ఆధ్వర్యంలో 66వ విభిన్న ప్రతిభావంతుల వారోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగుల దినోత్సవ కేక్‌ను ఎంపీపీ భార్గవి కట్‌చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా డీటీ మేఘవర్ణం మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానన్నారు. తులసి ట్రావెల్స్ వారు మాంగాడుకు చెందిన ధనవేల్‌కు, తడుకుపేటకు చెందిన ప్రసాద్‌కు వినికిడి యంత్రాలను ఉచితంగా అందించారు. స్వచ్ఛంద సేవకులు మనీ, రాజా తులసిరామ్, మదినబాయ్, దివ్యాంగుల సంఘం నాయకులు కేశవన్, సభ్యులు శ్రీధర్, దాము, వినోద్, కుమారస్వామి, ఎలుమలై, ప్రసాద్ పాల్గొన్నారు.

నగరికి విచ్చేసిన నటి విజి

ప్రజాశక్తి- విజయపురం (నగరి): నగరి పట్టణంలో అఖండ 2 తాండవం చిత్రం ప్రదర్శిస్తున్న ఎస్‌జే శ్రీనివాసా థియేటర్‌కు ఆ చిత్రంలో బాలకృష్ణకు తల్లిగా నటించిన విజి విచ్చేశారు. మేనేజర్ చలపతితో పాటు విచ్చేసిన ఆమెకు థియేటర్ యాజమాన్యం వారు దుస్సాలువలతో సత్కరించి మొమెంటోను అందించారు. అనంతరం స్థానిక కరకంటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లిన ఆమె స్వామిని దర్శించుకున్నారు.

43 వీధి కుక్కలకు టీకాలు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల, పరిసర గ్రామాల పరిధిలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, నివారించాలని అర్జీలు రావడంతో పశువైద్య సిబ్బంది సహకారంతో వీధి కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు వేయిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి విశ్వమాలిని తెలిపారు. పశువైద్యాధికారిని చందన ప్రియ మాట్లాడుతూ 43 వీధి కుక్కలకు యాంటీ రేబిస్ టీకా వేయడం జరిగిందని, దీనివల్ల కుక్క కరిచినా మనుషులకు పశువులకు గొర్రెలకు ఎలాంటి రేబిస్ వ్యాధి సోకదని తెలిపారు. పశు వైద్య సిబ్బంది రవితేజ, శివ, నూర్ మహమ్మద్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని సనత్ నగర్ లో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలలో మెప్మా ఆధ్వర్యంలో సఖి సురక్ష ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ మహిళల్లో ఎక్కువగా కేన్సర్ సమస్యలు వస్తు న్నా యని వీటిని ప్రారంభ దశలోనే తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు , మెప్మా సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -కోట :

కోట మండలం విద్యానగర్ లో కార్ వాష్ సెంటర్ వద్ద చెందోడు గ్రామానికి చెందిన ఎంవి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గూడూరు మెడి పల్స్ రక్తనిధి కేంద్రం సౌజన్యంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా, కేంద్రం ఇన్‌చార్జ్ ఎం సురేష్ ప్రారంభించారు. ముప్పు వరపు వెంకటేశ్వరరావు,ముప్పవరపు ఆదిలక్ష్మి చిత్రపటాలకు జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎమ్ సురేష్ పాల్గొన్నారు. రక్తదాతలకు పండ్లు బిస్కెట్లు సర్టిఫికెట్ తో పాటు ప్లాస్కోలను రక్తదాతలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవి రావు , ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలామోహన్ కృష్ణ, ఎన్‌బికెఆర్ కళాశాలకు సేవలకు చెందిన ఉద్యోగి వైద్యులు షమీ, రక్తనిధి కేంద్రం సిబ్బంది, రక్త దాతలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

మండలం జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో శుక్రవారం బాల్య వివాహాలను అరికట్టేందుకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. బాల్యవివాహల కారణంగా కలిగే అనర్దాలు గురించి, పౌష్టికహారాలు లోపిస్తే కలిగే అనర్దాలు, ప్రభుత్వం అందించే పోషకాలు గురించి, బియ్యం, ఉప్పు, ఆయిల్, పాలు, గోధుమపిండి బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం వలన కలిగే లాబాలు, పిల్లల చేరుకోవలసిన లక్ష్యాలు గురించి. తెలిపారు. మండలం లోని అన్ని జడ్పీహెచ్‌ఎస్ స్కూల్స్ లో బాలల హక్కుల గురించి పోటీ పరీక్షల నిర్వహించి బహుమతులను ఎంఈఓ తిరుమలరాజు చేతుల మీదుగా ఇప్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భువనేశ్వరి , ఐసీడీయస్ ఇన్‌చార్జి సీడీపీఓ సంధ్య , సూపర్వైజర్ శ్రీదేవి, అనిత జి ఎం.ఎస్ కె ఇందుమతి, రెడ్డి లీలా సాయి, టాటా ట్రస్ట్ కోఆర్డినేటర్ సంతోషి, జిల్లా బాలల రక్షణ కౌన్సెలర్ జ్యోతిశ్వరి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పిల్లలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఐరాల: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే ప్రతి శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఐరాల మండలం ఎంపీడీవో కార్యాలయంలో మండల అధ్యక్షులు గంగవరపు హరిబాబు అధ్యక్షతన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూతలపట్టు నియోజకవర్గ శాసనసభ్యులు మురళీమోహన్ పాల్గొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వారి నుండి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సుమారు వందకు పైగా దరఖాస్తులు అందాయి. ప్రతి ఫిర్యాదుపై అక్కడికక్కడే సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన భూ సర్వే గందరగోళమే ఇప్పటికీ భూ సమస్యలకు కారణమని ఎమ్మెల్యే గుర్తించారు. ఈ సమస్యల వల్ల చాలా మందికి సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్లకు పసిపిల్లల ఆలనాపాలన చూసే యశోదా దేవిలా మీ పనితీరు మెరుగుపరచి బాల్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నుంచి మీకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ క్రమంలో అంగన్వాడీ టీచర్లకు 5జి మొబైల్ అందించడం జరిగింది. అనంతరం ఐరాల మండలం కొండేపల్లి దళిత వాడికి చెందిన గొడుగు చింత మేఘనాథ్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి లక్ష రూపాయలు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం దేవస్థానం ఆలయ కమిటీ ఛైర్మన్ మనీ నాయుడు, ఐరాల, తవణంపల్లి మండల అధ్యక్షులు హరిబాబు నాయుడు, వెంకటేష్ చౌదరి, పూతలపట్టు పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ గిరినాయుడు, జడ్పీటీసీ సభ్యురాలు సుచిత్ర కన్నయ్యనాయుడు, సింగిల్ విండో అధ్యక్షులు శేషాద్రి నాయుడు, ఐరాల తహశీల్దార్ లోకేశ్వరి, కాణిపాకం బోర్డ్ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, మండల ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

టోల్ ప్లాజా వద్ద అంబులెన్స్ సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో సమిష్టిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడంలో భాగంగా ప్రధానంగా ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు రెవెన్యూ శాఖలతో పాటు అత్యవసర వైద్య సేవలను అందించేందుకు అవసరమైన పూర్తి సమాచారంను డిసి హెచ్‌ఎస్, డిఎంఅండ్ హెచ్‌ఓ కలిసి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో బ్లాక్ స్పాట్స్ ఉన్న ప్రదేశాలకు దగ్గరలో అత్యవసర వైద్య సేవలు పొందడంలో భాగంగా సామాజిక ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉన్న డాక్టర్ల వివరాలు, వారి ఫోన్ నెంబర్లు, అందుబాటులో ఉన్నబ్లడ్ గ్రూప్స్ సంబంధిత వివరాలు, అంబులెన్స్ వివరాలు, వైద్యసేవలు అత్యవసరంగా అందించేందుకు అవసరమైన పూర్తి సమాచారాన్ని సిద్ధం చేయాలన్నారు. చిత్తూరు జిల్లాలోని ఎన్.హెచ్–140 రహదారి పరిధిలో ఉన్న అన్ని ప్రమాదకర ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి 140– 2, ఎన్‌హెచ్ 69–10, ఎన్‌హెచ్ 42–10,(22) బ్లాక్ స్పాట్స్ తొలగించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్‌హెచ్ –69 కలెక్టర్ కార్యాలయం నుండి తమిళనాడు సరిహద్దు వరకు ఉన్న ఈ మార్గంలో గుర్తించిన బ్లాక్ స్పాట్లను అవసరమైన భద్రత చర్యలను అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని, వీటిలో భద్రతా సూచికల ఏర్పాటు, సోలార్ బ్లింకర్లు, రోడ్ సైన్‌బోర్డులు, రోడ్ మార్కింగ్‌లు, పెయింటింగ్‌లు, తగినంత వెలుగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. హైవే లైటింగ్ కనెక్షన్, సోలార్ బ్లింకర్లు, ట్రాన్స్‌వర్స్ బార్ మార్కింగ్‌లు, రోడ్ మార్కింగ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిత్తూరు వైపు నుండి గుడిపాల వైపు వెళ్లే దారిలో ఒక డివైడర్ ఏర్పాటు చేయబడిందని, ఈ డివైడర్ వద్ద హైవే లైటింగ్ కనెక్షన్ అవసరం ఉందన్నారు.

రెండు నెలల్లో అందుబాటులోకి 'ఈట్ స్ట్రీట్'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:

ఈట్ స్ట్రీట్ నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా అచ్యుత దేవరాయ మార్గంలో ఏర్పాటు చేస్తున్న ఈట్ స్ట్రీట్ పనులను శుక్రవారం ఉదయం అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈట్ స్ట్రీట్ ప్లాన్, వాహనాల పార్కింగ్ తదితర వాటిని అధికారులు కమిషనర్ కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్ధలు అందుబాటులోకి తెచ్చేందుకు ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సుమారు కోటి రూపాయల భారత ప్రభుత్వ నిధులతో 12 కంటైనర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వాహనాలు పార్క్ చేసుకునేందుకు పార్కింగ్ స్థలం, పిల్లలు ఆడుకునేందుకు ప్లే జోన్, వాటర్ ఫౌంటైన్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈట్ స్ట్రీట్ లోని షాపులను టెండర్ ద్వారా కేటాయించడం జరుగుతుందని తెలిపారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, డి. ఈ. వెంకట ప్రసాద్, తదితరులు ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని అలవరుచుకోవాలి

ప్రజాశక్తి -రామచంద్రపురం: గ్రామీణ ప్రాంతాలలోని రైతులు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయ పంటలను సాగు చేయాలని దక్షిణ మండల వ్యవసాయ సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి సుమతి కోరారు. శుక్రవారం మండలంలోని కుప్పం బాదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేకపాటి గౌతమ రెడ్డి వ్యవసాయ కళాశాల, తిరుపతి ఆచార్య ఎన్జీరంగా ప్రాంతీయ పరిశోధన స్థానం సంయుక్తంగా రైతు సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేకపాటి గౌతమ్ రెడ్డి, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారిణి బి మమత, ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు మురళీకృష్ణ, ప్రతిమ, నాగ మాధురి, జాన్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కదిరి మోహన్, సునీత, శ్రీనివాసరావు, వ్యవసాయ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

దారి వివాదం పరిశీలన

ప్రజాశక్తి-బాలాయపల్లి:

మండలంలోని కయ్యూరు గ్రామానికి చెందిన రావిళ్ల రాఘవేంద్ర అనేవ్యక్తి పొలాల్లోకి వెళ్లేదారిని కొందరు అడ్డుకుంటున్నారనే ఫిర్యాదు మేరకు తహశీల్దారు విజయలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ వెంకటసుబ్బానాయుడు అనే వ్యక్తి పొలాల్లోకి వెళ్ల నివ్వకుండా గేటు ఏర్పాటు చేశారని వివరించారు. దారికి అడ్డుగా ఏర్పాటు చేసిన గేటు ను తహసీల్దార్ పరిశీలించి దారి కి ఇబ్బంది లేకుండా చూడాలని రైతులకు సూచించారు. దారి రైతులు అందరి అవసరం అని అలాంటి దారులు ఆక్రమించడం సరికాదని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరి శ్రీకాంత్, మండల సర్వేయర్ పూజిత, విఆర్ ఓ మేకలయ్య పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-బాలాయపల్లి:

విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ తో పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని ఊట్లపల్లి గిరిజన కాలనీలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు కాలనీకి చెందిన ఏకోలు పెంచలమ్మ ఆమె భర్త ఇంట్లో ఉండగా ప్రమాదవ శాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వస్తుండడంతో గమనించిన పెంచలమ్మ బయటకు పరుగులు తీసి చూడగా ఇళ్లు కాలిపోతూ మంటలు ఎగసిపడుతుండడంతో వెంకటగిరి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంటిలోని సామగ్రి మొత్తం పూర్తి గా బూడిద పాలైంది. పూమారు 50 వేలు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖాదికారులు అంచనావేశారు. ఇళ్లు దగ్గం కావడంతో ఏకోలు పెంచలమ్మ కుటుంబం కట్టుబట్టలతో మిగిలారు.

క్రైం న్యూస్

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పట్టణ పరిసరాలు, గుడిపాలలో పలు ద్విచక్ర వాహనాల దొంగతనాలు జరిగిన నేపథ్యంలో గుడిపాల పోలీసులకు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ డీఎస్పీ సాయినాథ్‌ఆధ్వర్యంలో గుడిపాల ఎస్ఐ, సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలలో దర్యాప్తు చేశారు. రాబడిన సమాచారం మేరకు ముద్దాయిలను గొల్లమడుగు వద్ద అదుపులోకి తీసుకున్నారు. ముద్దాయిల విచారణలో ఏ1 కిరణ్, పల్లూరుకి చెందిన జయ ప్రకాష్‌తో కలిసి విలాసాల కోసం చిత్తూరు టౌన్‌లో మోటార్ సైకిళ్ళు దొంగతనం చేసి తమిళనాడులోని వెల్లూరు, కాట్పాడిలో అమ్మేవారని తెలిపారు. చిత్తూరు టౌన్‌లో దొంగతనం చేసి 1 టౌన్ పోలీసులుకు పట్టుపడగా వారు కేసు నమోదు చేసి వారిని జైలుకి పంపారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కిరణ్, చిత్తపారలో నాటు సారాయి అమ్ముతుండగా గుడిపాల పోలీసులు 2 కేసులు పెట్టి జైలుకు పంపారని, జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత తన గ్రామానికే చెందిన దొరైరాజుతో కలిసి 2024లో కాట్పాడి, వెల్లూరులో దొంగతనం చేసి ఆంధ్రాలో మోటార్ సైకిళ్ల అమ్ముతుండగా కాట్పాడి పోలీసులు అదుపులోకి తీసుకుని జైలుకు పంపారని తెలిపారు. విడుదల అయిన తర్వాత కిరణ్, వైరముత్తు, జయప్రకాష్, కిరణ్ స్నేహితుడు జయసూర్య అందరూ కలిసి చిత్తూరు, గుడిపాల, యాదమరి, వెల్లూరు జిల్లాలో 36 మోటార్ సైకిళ్ల దొంగతనం చేశారని పోలీసులకు తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బు స్వాహా

వ్యక్తి పై కేసు నమోదు

ప్రజాశక్తి- పుంగనూరు:

నిరుద్యోగులుగా ఉన్న వారికి ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు ఎస్పై కేవీ రమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అడవినాథకుంట గ్రామానికి చెందిన రత్నరెడ్డి కుమారుడు మహేందర్ రెడ్డి పట్టణంలోని కొత్త ఇండ్లులో కాపురం ఉన్నాడు. ఇతనికి పట్టణంలోని సూర్య నగర్‌కు చెందిన మురహరి స్నేహితుడు. మహేందర్ రెడ్డికి రాఘవ కుమార్తె తలారి వాసవి, టి.శ్రీవిద్య, పి.వినయ్ కుమార్‌లకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని వారి వద్ద నుండి 2024 ఫిబ్రవరి 24న రూ.4,87,000లు తీసుకున్నాడు. అప్పటినుంచి ఇప్పటివరకు ఉద్యోగం ఇప్పించలేదని వాయిదాలు వేస్తూ వచ్చాడు. డబ్బు తిరిగి ఇవ్వమన్నందుకు వారిని బెదిరించడం కూడా జరిగింది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలి

విద్యుత్ శాఖ ఈఈనరేందర్ రెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఇంధనాన్ని పొదుపుగా వాడుకోవాలని విద్యుత్ శాఖ ఈఈ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ మహిళా కళాశాలలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏపీ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9,10 తరగతుల విద్యార్థిని విద్యార్థులకు ఇంధన పొదుపు పై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడి ప్రసాద్ , ఎం ఈవో కాంచన, ఏఈ ఏడు కొండలు పాల్గొన్నారు.

ఘనంగా శతజయంతి వేడుకలు

ప్రజాశక్తి -పాకాల:

పాకాల పట్టణంలో శ్రీరామ కృష్ణ ఆశ్రమం ప్రారంభించి నేటికి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా స్వర్ణత్సవ సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి రామకృష్ణ ఆశ్రమ అధ్యక్షులు స్వామి సుక్రతా నందా, మహారాజ్ , కడప రామకృష్ణ ఆశ్రమ అధ్యక్షులు అనుపమానందా, మహారాజ్ , చెన్నై శ్రీ రామకృష్ణమఠం స్వామి యదునాకానందా మహారాజ్ హాజరై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గడచిన 50 సంవత్సరాలుగా సేవలందించిన సభ్యులకు సత్కారం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మఠస్వాములు మాట్లాడుతూ రామకృష్ణ ఆశ్రమ ప్రజలలో సేవా భావంతో పాటు ఆధ్యాత్మిక విలువలను పెంపొందించే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సుమారుగా 900 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎంసి రామచంద్రారెడ్డి, ఎన్ పరందంనాయుడు, వి సుధాకర్ రెడ్డి , టిఆర్ సురేష్ , కేసాధ్యకి , ఓంకార్ సుబ్రహ్మణ్యం , దొరస్వామినాయుడుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఎక్స్ పోలో జిల్లా ప్రతినిధులు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఎక్స్‌పో కార్యక్రమం విజయవాడలో ఈనెల 12న ప్రారంభమై 14వ వరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో జిల్లా ప్రతి నిధులు హాజరైనట్లు ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవి చౌదరి శుక్రవారం పేర్కొన్నారు. విజయవాడలోని ఎస్ ఎస్ కన్వర్షన్ హాల్లో ఈ కార్యక్రమం ప్రారంభ మైందని వ్యాపారులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేశారన్నారు. వ్యాపారులకు సంబంధించిన కొత్త కొత్త అంశాలు ఈ ఎక్స్‌పోలో తెలుసుకునే అవకాశాలు ఉందన్నారు. రాష్ట్ర నలు మూలల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారస్తులు రావడం వల్ల అనేక సందేహాలు సెమినార్ నివృత్తి చేసుకోవచ్చున్నారు. ఈ ఎక్స్ పో కార్యక్రమం వ్యాపారస్తులకు ఉచిత ప్రవేశం కల్పించారన్నారు.

నిబంధనలు లేని భవనాలకు నోటీసులు ఇవ్వండి

కమిషనర్ ఎన్ మౌర్య

ప్రజాశక్తి-తిరుపతి టౌన్:

నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలకు నోటీసులు ఇచ్చి, బిపిఎస్, ఎల్ఆర్ఎస్ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై భవన యజమానులకు అవగాహన కల్పించాలని కమిషనర్ ఎన్ మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. బిపిఎస్, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, ఎల్‌టిపిల (లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్)తో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను సవరించు కోవడానికి ఇచ్చిన బిపిఎస్, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు తక్కువగా వస్తున్నాయని తెలిపారు. బిపిఎస్ వల్ల కలిగే ప్రయోజనాలను ఎల్‌టిపిలు భవన యజమానులకు తెలపాలన్నారు. ఎవరైనా అదనపు అంతస్థులు నిర్మించాలనుకుంటే టిడిఆర్ బాండ్లు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆగష్టు 31 తరువాత అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తే కూల్చివేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిసిపి ఖాన్, ఏసిపి లు మూర్తి, పార్వతి ప్రియ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, టిపిఓ లు మధు, వంశి, సంతోష్, ఎల్‌టిపిలు పాల్గొన్నారు.